RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శేనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:192 | బుధవారం | 12 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
శేనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.
77309 83966 98491 98098

## రేవంత్ బాగోతం బయటపెడతా



- సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు
- కొండల్‌రెడ్డి సంస్థకు భూమి కేటాయింపుపై విమర్శలు
- టెస్సెరాక్ట్‌లో ఒక్క ఉద్యోగి కూడా లేరని వ్యాఖ్య
- సీఎం కుటుంబంపై వరుస ఆరోపణలు
- మంత్రి శ్రీధర్‌బాబు సమర్థనపై ప్రశ్నలు

**హైదరాబాద్, ఆగస్టు 11:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా సీఎం సోదరులు చిన్న చిన్న ఇంటి అడ్రస్లతో పెద్దపెద్ద కంపెనీలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన అయిదెకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్రెడ్డి

మిగతా 2వ పేజీలో..

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

- వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి
- రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11 :** మెట్రో రైలు రెండో దశలో భాగంగా పాత బస్తీ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ ఆర్ఎంఎల్)పై ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాత బస్తీ మెట్రో పనులపై పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్

మిగతా 2వ పేజీలో..



### ప్రపంచస్థాయి విద్య.. అదే మా లక్ష్యం 2

## రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి

- ఎల్ నినో నేపథ్యంలో ముందస్తు చర్యలు అత్యవసరం
- సాగు, తాగునీటి ప్రణాళిక సిద్ధం చేయాలి
- కలెక్టర్, ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీకి హరీశ్ రావు లేఖ

3



## 3.43కోట్ల మందికి స్మార్ట్ ఆహార భద్రత

- 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం
- సీఎం కార్యక్రమ ఏర్పాట్లలో లోపం ఉండొద్దు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 11:** రాష్ట్రంలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్

మిగతా 2వ పేజీలో..



## నిషేధిత భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- యుద్ధప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

2





## ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

- సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి సురేఖ

2

## రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

- కేంద్ర మంత్రికి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు
- ఒక్కో ఇంటిపై రూ.50 వేల తేడా ఉందని వెల్లడి
- పార్లమెంట్ స్తంభనపై విపక్షాల తీరును తప్పుబట్టిన రఘునందన్‌రావు

3



## పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

3



## 73 లక్షల ఓట్లు పోయినట్టే

- తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి
- 3.38 కోట్లకు చేరిన ఓటర్ల సంఖ్య
- 2.64 కోట్ల ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- 45.18 లక్షల మంది శాశ్వత వలస
- 9.22 లక్షల మంది మృతి చెందినట్టు నమోదు
- 11.25 లక్షల మందికి ఆచూకీ లేకుండా..

3

## జీనోమ్ వ్యాలీలో యామ్లైన్

- 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు
- హర్షం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు

3



## ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై కేంద్రం కీలక నిర్ణయం

4



## కొత్త ఉత్సాహాన్నిస్తోన్న 'నవ భారత యువభేరి'

- 13 ఏళ్ల నాటి ఘట్టాన్ని గుర్తు చేసుకున్న కిషన్‌రెడ్డి

## గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే



- నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదు
- ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చేసి తీరాల్సిందే
- అధికారులూ.. మనసుపెట్టి పనిచేయండి
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 11 :** ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని, నిర్లక్ష్యాన్ని, పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉప్పల్ మీదుగా వరంగల్ వైపు ప్రయాణించే వారికి ఆ రహదారి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని, అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం.. ఆ ప్రకారం చేసి తీరాల్సిందేనని మంత్రి పునరుద్ఘాటించారు. ప్రజలకు ట్రాఫిక్


మిగతా 2వ పేజీలో..



## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం: మోదీ

- అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపు

4




# ప్రపంచస్థాయి విద్య.. అదే మా లక్ష్యం

- ‘ఎక్స్’’లో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆరఎస్) వేగంగా రూపు దిద్దుకుంటున్నాయి అని సీఎం రేవంత్‌రెడ్డి ‘ఎక్స్’లో పోస్టు చేశారు. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ ప్రతి చిన్నారికి ప్రపంచస్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి అని పేర్కొన్నారు.

# రేవంత్ బాగోతం బయటపెడతా

మొదటిపేజీ తరువాయి

టెసరాక్ కంపెనీ చైర్మన్ అని లింక్ డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటా యించారని ప్రశ్నించారు. రూ. 2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్ బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడె ఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండలరెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్గా ఆయనే పేర్కొన్నారు. కొండల్ రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ టింగ్ కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతి రెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్ని కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల వోట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా వోటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల వోట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ టింగ్కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జల సౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 11 :**



రాజీవ్ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. కార్ఖానాలో బాధితుల ఆందోళనలో ఆయన పాల్గొని వారికి బీజేపీ తరఫున సంఘీభావం తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అందరూ సహకరిస్తున్నారని, అయితే తమ ఆస్తులను త్యాగం చేస్తున్న ప్రజలకు సరైన విలువతో కూడిన న్యాయమైన పరిహారం అందాల్సిన అవసరం ఉందని అన్నారు. తూంకుంట ప్రాంతంలో భూముల పరిహారాన్ని పెంచిన విధంగా రాజీవ్ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న కార్ఖానా ప్రాంత ప్రజలకు కూడా తగిన మేర పరిహారం పెంచాలని ఆయన కోరారు. తూంకుంటలో పెంచిన పరిహారం కంటే ఈ ప్రాంతం మరింత ఖరీదైన అర్బన్ ప్రాంతమని, అలాంటి పరిస్థితుల్లో ఇక్కడ తక్కువ పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూంకుంట మాదిరి ఇక్కడ కూడా సముచితమైన శాతం మేర పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల న్యాయమైన డిమాండ్‌కు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

మొదటిపేజీ తరువాయి



నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలన్నారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా అదనపు బోగీలను జత చేయాలని, ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్**

డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 3.43కోట్ల మందికి ‘స్మార్ట్’ ఆహార భద్రత

మొదటిపేజీ తరువాయి

కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన 15వ తేదీన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్దిదారులు లబ్ది పొందుతున్నారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్దిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు.

**ఏడాదిన్నరలో 16.32 లక్షల కొత్త కార్డులు**

2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు.

**లబ్ధిదారుడికి ఇబ్బంది కలగొద్దు**

సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతోపాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్ టు మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు.

**ప్రతి అర్హుడికీ ఆహార భద్రతే లక్ష్యం**

‘రాష్ట్రంలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం.. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం.. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం’ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు 3.43 కోట్ల లబ్దిదారులు ఉచిత సన్న బియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతోపాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.



# ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాU మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మంగళవారం మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి, అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో మారు బోనం సమర్పించారు. బోనమెత్తిన మహిళలకు మంత్రి సురేఖ చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారుబోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం చేయడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారంతో ఈ ఏడాది బోనాలు వైభవోపేతంగా జరుగుతున్నాయన్నారు.

# గడువులోగా ఉప్పల్ కారిడార్ పూర్తి కావాల్సిందే

మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని, అందుకనుగుణంగా అధికారులు మనసు పెట్టాలని ప్రత్యేకంగా కోరారు. కార్మికుల సంఖ్య పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని, రాత్రిళ్లు 11 నుండి ఉదయం 6 గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలని మంత్రి ఆదేశించారు. కారిడార్ కింద 6.25 కి.మీ బీటీ రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకో□సారి తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పురోగతి సమీక్షిస్తానని, అందుకు తగ్గట్టు రోజువారీ వర్క్ ప్రోగ్రెస్‌ను అధికారులు సమీక్షించాలని ఆదేశించారు. పనులు 60% మేర పూర్తయ్యాయని, మరో 40% పనులు వేగంగా జరుగుతున్నాయని, సైట్‌లో సెగ్మెంట్ తయారీకి నాలుగు బెడ్లు, నాలుగు గ్యాంట్రీస్‌తో 300మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారని అధికారులు, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అటు నారపల్లి(సీపీఆర్) వైపు నుండి, ఇటు ఉప్పల్ వైపు నుండి ఇరువైపులా లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని, రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనులు, వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదని నిర్మాణ సంస్థ తెలిపింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం.. ప్రజల ఇబ్బందుల గురించి ఆలోచించాలంటూ వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తిచేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. దీనికి అనుసంధానంగా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై ఆరా తీసిన మంత్రి ఆ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దసరాకు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని, అధికారులు, వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్అండ్‌బి సీఈ ధర్మారెడ్డి, పలువురు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

నిషేధిత ఆస్తుల పీవోబీ/22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఎ/పీవోబీ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టొచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందని అన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది సరైనది ఏది కాదు గుర్తించి సరైన వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితోపాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. పీవోబీ దరఖాస్తులకు సంబంధించి □కేసు వారీగా రోజూ సమీక్షించాలన్నారు. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి, అర్హులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు వద్దని, ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చానని అన్నారు. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదంటూ ఏ చిన్న తప్పు చేసినా క్షమించేదిలేదు.. కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ దృష్టికి గాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలన్నారు. పీవోబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలన్నారు. పీవోబీకి సంబంధించి వచ్చిన ప్రతీ దరఖాస్తును ఇకనుండి తహసీల్దార్‌కు కాకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలి.. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి అని చెప్పారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి.. వీటిని సమీకృతం చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారనే ఫిర్యాదుల వస్తున్నాయన్నారు. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లు అడుగంటాయ్.. రైతులను ఆదుకోండి

**సిద్దిపేట, ఆగస్టు 11:**

సిద్ధిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరారు. వచ్చే ఏడాది జూలై వరకు జిల్లాలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరత తను అధిగమించేందుకు ముందస్తు చర్యలు అత్యవసరమని పేర్కొంటూ కలెక్టర్ కు లేఖ రాశారు. జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో హరీశ్రావు రాసిన లేఖలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు, రైతుల సాగు పరిస్థితి, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పరిస్థితి, రానున్న యాసంగి పంటకు నీటి లభ్యత తదితర అంశాలను ప్రస్తావించారు.

**రిజర్వాయర్ల పరిస్థితి ఆందోళనకరం**

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నామని హరీశ్ రావు తెలిపారు. సాధారణంగా ఏటా ఈ సమయానికి మిమ్మానేరు రిజర్వాయర్ నుంచి వీటికి నీటిని ఎత్తిపోసేవారని, ఈసారి ఇప్పటివరకు ఎత్తిపోతలు ప్రారంభించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కూడా అడుగంటిన పరిస్థితిలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నింపాలని హరీశ్రావు కోరారు. రిజర్వా యర్ల నుంచి చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్లను నింపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత వానాకాలం పంటలకు రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

**65 శాతానికే వానాకాలం సాగు**

ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారని హరీశ్ రావు తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు గట్టెక్కాలన్నా రిజర్వాయర్లను నింపడం అత్యవసరమని, రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. 2027 జూలై వరకు ఎల్నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో అప్పటివరకు సాగు, తాగునీటికి కొరత రాకుండా ఇప్పటి నుంచే నీటి నిల్వలపై దృష్టి పెట్టాలని లని హరీశ్రావు సూచించారు. ప్రస్తుత అవసరాల కోసం నీటిని వినియోగించిన అనంతరం మళ్లీ ఎత్తిపోసుకునే అవకాశం ఉండేలా మిద్మానేరు రిజర్వాయర్లో జిల్లాకు సరిపడ నీటిని నిల్వ ఉంచాలని కోరారు. వచ్చే యాసంగి పంట కాలంలో అవసరమైనప్పుడు మిద్మానేరు నుంచి నీటిని ఎత్తిపోసుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని హరీశ్రావు కోరారు.

**తాగునీటికి 6 నుంచి 7 టీఎంసీలు అవసరం**

జిల్లాలో తాగునీటి అవసరాలకే సుమారు 6 నుంచి 7 టీఎంసీల నీరు అవసరమవుతుందని హరీశ్రావు తెలిపారు. వరి, పామాయిల్, ఇతర పంటలు సాగు చేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రైతులు నీటిని ఎత్తిపోస్తారని ఆశగా ఎదు రుచూస్తున్న సమయంలో రిజర్వాయర్ల దుస్థితిని చూస్తే బాధగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలోనే వడివడిగా నీటిని ఎత్తిపోసి ఉంటే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని హరీశ్రావు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లాలోని వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నీటిని జిల్లాకు అందుబాటులోకి తీసుకురావా లని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హరీశ్ రావు సూచించారు. వొచ్చే వేసవిని దృష్టిలో పె ట్టుకుని ఇప్పటి నుంచే రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడమే తక్షణ ప్రాధాన్యతగా ఉండాలని హరీశ్రావు తన లేఖలో స్పష్టం చేశారు.

# 73 లక్షల ఓట్లు పోయినట్టే

**హైదరాబాద్, ఆగస్టు 11**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటివరకు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా.. నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. మరోవైపు 73.39 లక్షల ఫారాలు వివిధ కారణాలతో సేకరించలేకపోయినట్టు అధికారులు తేల్చారు.

**73.39 లక్షల ఫారాలు అన్‌కలెక్టబుల్**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులోకి రాలేదు. ఇవి మొత్తం ఓటర్లలో 21.70 శాతంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనలో ఓటర్లు నివాసాలు మార్చడం, మరణించడం, చిరునామాలు లభించకపోవడం, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదు కావడం వంటి కారణాలు ప్రధానంగా వెలుగుచూశాయి.

**45.18 లక్షల మంది శాశ్వత వలస**

అన్‌కలెక్టబుల్ ఫారాల్లో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ పాత నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్టు గుర్తించారు. వీరి వివరాలు ప్రస్తుత చిరునామాలకు అనుగుణంగా మారే అవకాశం ఉంది. దీంతో తుది జాబితాలో ఓటర్ల సంఖ్య, నియోజకవర్గాల వారీగా నమోదులో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

**9.22 లక్షల మంది మృతి**

ఎన్యూమరేషన్ సందర్భంగా 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్టు నమోదైంది. వీరి పేర్లు తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టనున్నారు. మరో 11.25 లక్షల మంది ఓటర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఆచూకీ లభించలేదని అధికారులు గుర్తించారు.

**ఇప్పటికే మరోచోట నమోదు**

సుమారు 6.70 లక్షల మందికిపైగా ఓటర్లు ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తుది ఓటర్ల జాబితా ప్రస్తుత జాబితాతో పోలిస్తే గణనీయంగా మారే అవకాశం ఉంది.

# పత్తి కొనుగోళ్లలో రైతుకు ఇబ్బందులుండొద్దు

- 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించాలి
- జిల్లా మానిటరింగ్ కమిటీల్లోో రైతులను భాగస్వాములను చేయాలి-
- 'కపాస్'లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళతరం చేయాలి
- సీసీఐ అధికారులతో సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

రాష్ట్రంలో 202627 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో మంగళవారం ఇక్కడ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, వ్యవస్థలకు చెడ్డ పేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మనం బతకాలంటే రైతు బతకాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్లి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమన్నారు. సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సీజన్‌లో అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. లాంగ్ స్టేపుల్ పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ఎంఎస్‌పీ ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు అంతకంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎల్1 నుంచి ఎల్12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత సీజన్‌లో 122 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉండగా ఈ సీజన్‌లో 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, మిల్లుల వద్ద అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకనుగుణంగా పొడిగించాలని సూచించారు.

**'కపాస్' బుకింగ్‌ను సరళతరం చేయాలి**

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుల్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలన్నారు. పంట బుకింగ్ డేటాను ఎనఐసీ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు అత్యంత వేగంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి దానికంటే అధిక దిగుబడి పొందిన రైతులకు ఏఈవోల ద్వారా డిజిటల్ ఈల్డ్ సర్టిఫికెట్స్ వెంటనే జారీ చేయాలని మంత్రి సూచించారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో స్టేపుల్ లెంగ్త్, మైక్రోనైర్, తేమ శాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు తప్పనిసరిగా పనిచేసేలా చూడాలన్నారు. ఎంఎస్‌పీపై పూర్తి అవగాహన కల్పించాలని, రైతు నేస్తం, గ్రామస్థాయి కార్యక్రమాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా సీసీఐ కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ లేదా పెండింగ్ ఏర్పడినప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రైతుకు ఎంఎస్‌పీ అందించడమే ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో ఏ స్థాయిలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని మంత్రి హెచ్చరించారు.

# రాష్ట్రంలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్

**హైదరాబాద్, ఆగస్టు 11**

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ స్కామ్‌కు పాల్పడిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉచిత విద్యుత్ పేరుతో కేంద్రం అందిస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆయన ఆరోపించారు.

**40 వేల ఇళ్లకు ప్యానెళ్లు**

'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించే 40 వేల ఇళ్లను గుర్తించి సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్‌రావు తెలిపారు. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ఏర్పాటు కోసం ఓ సంస్థకు రూ.1,36,000 చొప్పున కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు.

**సబ్‌కాంట్రాక్టుతో రూ.50 వేల తేడా**

కాంట్రాక్టు పొందిన సంస్థ అదే పనిని మరో సంస్థకు రూ.86,000కే సబ్‌కాంట్రాక్టు ఇచ్చిందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. దీంతో ఒక్కో ఇంటిపై రూ.50 వేల వ్యత్యాసం ఏర్పడుతోందని తెలిపారు. 40 వేల ఇళ్లకు ఇదే విధానం వర్తిస్తే రూ.200 కోట్ల మేర అవినీతికి అవకాశం ఏర్పడిందని ఆరోపించారు.

**కేంద్ర సబ్సిడీపై ప్రశ్నలు**

సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున సబ్సిడీ అందిస్తోందని రఘునందన్‌రావు తెలిపారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదంటూ కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వడంతోపాటు వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు. లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై విమర్శలు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపైనా రఘునందన్‌రావు స్పందించారు. సభను నడిపించడంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలకు సమాన బాధ్యత ఉందన్నారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు సరైన అంశం లేక రోజూ సభలో ఆందోళన చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విపక్షాల నిరసనల కారణంగా ఇతర ఎంపీలు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# జీనోమ్ వ్యాలీలో యామైన్

**హైదరాబాద్, ఆగస్ట్ 11:**

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామైన్' జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరి శోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయ డానికి ముందుకొచ్చింది. ఈ మేరకు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో మంగళవారం ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామైన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్ర మల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకా శాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భం గా వెల్లడించారు. యామెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణ పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వా నికి దక్కిన గౌరవమని అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామైన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామైన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత పాల్గొన్నారు.

# కొత్త ఉత్సాహాన్నిస్తోన్న నవ భారత యువభేరి

**హైదరాబాద్, ఆగస్టు 11 :**

దేశ గతిని మలుపు తిప్పి దేశ రాజకీయాల్లో సరికొత్త శకానికి బీజం వేసిన చారిత్రక ఘట్టానికి 13 ఏళ్లు.. బీజేపీ జాతీయ ప్రచార కమిటీ చైర్మన్‌గా, ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపికైన తర్వాత నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 'నవభారత యువభేరి' వేదికగా సరిగ్గా ఇదేరోజు(11 ఆగస్టు, 2013 నాడు) ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించిన దృశ్యాలు ఇవాల్టికీ కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఫేస్‌బుక్‌లో నాటి అనుభవాన్ని పోస్టు చేశారు. పబ్లిక్ మీటింగ్స్ చరిత్రలోనే తొలిసారిగా డెలిగేషన్ ఫీజును చెల్లించి మరీ లక్షలాదిమంది ఎల్‌బీ స్టేడియానికి తరలి వచ్చి నరేంద్రమోదీకి తమ సంపూర్ణమైన మద్దతును తెలియజేశారన్నారు. నాడు మన హైదరాబాద్ వేదికగా పడిన నరేంద్రమోదీ తొలి అడుగు తర్వాత దేశ రాజకీయాల్లో బీజేపీ సంచలన విజయాలతో దినదిన ప్రవర్ధమానమైందని, వారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇవాళ 'వికసిత భారత్ సంకల్పం2047' లక్ష్యాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతోందని తెలిపారు. ఈ చారిత్రకమైన సందర్భంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న తాను 13 ఏళ్ల నాటి ఆ అద్భుతమైన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నానన్నారు.

# చార్మినార్ వద్ద నకిలీ రాపిడో డ్రైవర్ హల్‌చల్

- అప్రమత్తతతో మోసాన్ని గుర్తించిన యువతి
- నంబర్ ప్లేట్, డ్రైవర్ ఐడీ లేకపోవడంతో అనుమానం
- అక్కడికక్కడే రాపిడో యాప్ డౌన్‌లోడ్ చేసిన వ్యక్తి
- వీడియో ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేసిన యువతి
- భద్రతా వివరాలు తనిఖీ చేసుకోవాలని రాపిడో సూచన

**హైదరాబాద్, ఆగస్టు 11**

చార్మినార్ సమీపంలో రాత్రివేళ ఓ యువతిని రాపిడో డ్రైవర్ పేరుతో ఓ వ్యక్తి నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, డ్రైవర్ గుర్తింపు కార్డు చూపించకపోవడంతో ఆమె అనుమానించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి అతడి అసలు వ్యవహారాన్ని గుర్తించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై మరోసారి ఆందోళనకు దారితీసింది.

**ఐడీ అడగడంతో అసలు విషయం..**

కంటెంట్ క్రియేటర్ సిద్ధేశ్వరి సుగంత్ రాత్రి 9 గంటల సమయంలో చార్మినార్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తుండగా స్కూటర్‌పై వచ్చిన వ్యక్తి రాపిడో కావాలా అని అడిగాడు. అయితే అతడి వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడాన్ని ఆమె గమనించింది. డ్రైవర్ ఐడీ కార్డు చూపించాలని కోరగా అతడు తడబడినట్టు ఆమె తెలిపింది.

**అక్కడే యాప్ డౌన్‌లోడ్..**


అనుమానం వ్యక్తం చేయడంతో ఆ వ్యక్తి తన ఫోన్‌లో ప్లే స్టోర్ తెరిచి రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. వాహనం స్టార్ట్ కావడం లేదంటూ విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేశాడు. ఫోన్‌ను పరిశీలించగా యాప్ అప్పుడే లాగిన్ అవుతూ ఓటీపీ పేజీలో ఉన్నట్టు గుర్తించింది. దీంతో అతడు నిజమైన రాపిడో డ్రైవర్ కాదని సిద్ధేశ్వరి నిర్ధారించుకుంది.

**గట్టిగా హెచ్చరించిన యువతి**

బుకింగ్ లేకుండా తనను బైక్‌పై రావాలని కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సిద్ధేశ్వరి.. మర్యాదగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని అతడిని హెచ్చరించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న ఆమె.. ఎలాంటి బుకింగ్, ధ్రువీకరణ లేకుండా ఓ వ్యక్తి ఇలా ప్రయాణికురాలిని ఎక్కించుకునేందుకు ప్రయత్నించడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది.

**ప్రయాణికులకు రాపిడో సూచనలు**

ఈ ఘటనపై స్పందించిన రాపిడో సంస్థ.. సిద్ధేశ్వరి అప్రమత్తతను అభినందించింది. యాప్‌లో రైడ్ బుక్ చేయకుండా నేరుగా వచ్చి తాము డ్రైవర్లమని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని వినియోగదారులను హెచ్చరించింది. ప్రయాణం ప్రారంభించే ముందు యాప్‌లో కనిపించే డ్రైవర్ గుర్తింపు, వాహన నంబర్, ఓటీపీ వివరాలను తప్పనిసరిగా సరిపోల్చుకోవాలని సూచించింది.





## రూ.10, రూ.20 నోట్లకు

# పాలిమర్ రూపం

- **రూ.200 కోట్ల నోట్లతో ప్రయోగాత్మక పరిశీలనకు కేంద్రం ఆమోదం**
- **కాగితపు నోట్లతో పాటే సమాంతరంగా చలామణి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11**

తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్ల మన్నికను పెంచేందుకు రూ.10, రూ.20 పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని సెక్షన్ 25 ప్రకారం వచ్చిన ప్రతిపాదన మేరకు 200 కోట్ల పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి పరిశీలన కోసం ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు.

**కాగితపు నోట్లతో కలిసే చలామణి**

ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని మంత్రి తెలిపారు. పాలిమర్ నోట్ల అధికారిక విడుదల తేదీ, తయారీ వ్యయం వంటి వివరాలు ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వీటిని చలామణిలోకి తీసుకురావాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్లు వివరించారు.

**మన్నిక ఎక్కువ.. చిరిగే అవకాశం తక్కువ**

ప్రపంచంలోని పలు దేశాల్లో మూడు దశాబ్దాలుగా పాలిమర్ కరెన్సీ వినియోగంలో ఉందని ప్రభుత్వం తెలిపింది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయని పేర్కొంది. ముఖ్యంగా తరచూ చేతులు మారే రూ.10, రూ.20 నోట్లు త్వరగా పాడవకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది.

**ద్రవ్యోల్బణం అదుపులోనే**

దేశ ఆర్థిక పరిస్థితిపైనా నిర్మలా సీతారామన్ వివరాలు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం, వాతావరణ మార్పుల ప్రభావంతో 202627 తొలి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరినా.. ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి లోపలే ఉందని చెప్పారు. జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణతో పన్ను భారం తగ్గిందని, వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపుతో ప్రజల ఖర్చు సామర్థ్యం పెరిగిందని తెలిపారు. దీంతో ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు తక్కువ, మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు.

## చైనా అభ్యంతరాలపై భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

- **అరుణాచల్ ప్రదేశ్ మాదే.. ఎవరూ మార్చలేరు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11**

అరుణాచల్ ప్రదేశ్‌లోని 27 ప్రాంతాలకు భారత్ అధికారికంగా పేర్లు పెట్టడంపై చైనా చేసిన అభ్యంతరాలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని, ఈ వాస్తవాన్ని ఎలాంటి చర్యలతోనూ మార్చలేరని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**27 ప్రాంతాలకు అధికారిక గుర్తింపు**

అరుణాచల్‌లోని 27 గ్రామాలు, భౌగోళిక ప్రాంతాలకు భారత్ అధికారిక పేర్లు ప్రకటించింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో వాటిని నమోదు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల గుర్తింపును మరింత స్పష్టం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచడం లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

**చైనా తీవ్ర అభ్యంతరం**

భారత్ నిర్ణయాన్ని చైనా విదేశాంగ శాఖ తప్పుబట్టింది. అరుణాచల్‌ను 'సౌత్ టిబెట్', 'జాంగ్నాన్'గా పేర్కొంటున్న చైనా.. భారత చర్యను చట్టవిరుద్ధమైనదిగా అభివర్ణించింది.

**పేర్లు పెడితే వాస్తవాలు మారవు**

చైనా గతంలోనూ అరుణాచల్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టింది. అయితే చైనా ప్రకటించే కల్పిత పేర్లతో భౌగోళిక వాస్తవాలు మారవని భారత్ స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో విడదీయరాని భాగమనే విషయంలో ఎలాంటి సందేహం లేదని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం**

భారత్‌చైనా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఇలాంటి చర్యలు ఆ ప్రక్రియకు ఆటంకం కలిగించే అవకాశం ఉందని భారత్ పేర్కొంది.



## యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు ఉండవు

- **కమ్యూనిస్టుల అబద్ధాల ప్రచారం తగదన్న నిర్మల**

**న్యూదిల్లీ, ఆగస్టు 11:**

రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు చార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయబోరన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రం భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. చార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి.. ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా అప్పటినుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత.. వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం: మోదీ

- **అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవం, గర్వం, ఘనతతో జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం సంకల్పం తీసుకోవాలని కోరారు. మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఈ సందేశాన్ని వెల్లడించారు.

**ఇంటింటా జాతీయ జెండా**

"హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా'' అంటూ మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించాలని సూచించారు. దేశభక్తి స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

**ఎన్డీఏ నేతల ఘన స్వాగతం**

పార్లమెంట్ హౌస్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలను చేతబూని 'వందే మాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో ఆయనకు స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియోను మోదీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

**సమావేశంలో పలువురు నేతలు**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ సమావేశానికి హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు.

## ఆంక్షల వ్యసనంలో అమెరికా

- **దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా**
- **ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి**

**టెహ్రాన్, ఆగస్టు 11:**




తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసు కోవడం సాధ్యం కాదని బఘాయి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

## అమిత్ షా లోక్‌సభకు రాలేదు

- **పిరికి వాడంటూ జైరామ్ రమేశ్ పోస్ట్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:**

విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.



### జనగణమన తరహాలో

# వందేమాతరం

- **చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

**న్యూదిల్లీ, ఆగస్టు 11:**

భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది. కొత్త చట్టం ప్రకారం 'వందేమాతరం'గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- **లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన**
- **సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా**
- **పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపీల పరస్పర నినాదాలు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గం దరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను స జావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల ని నాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగా ర్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై కేంద్రం కీలక నిర్ణయం

- **జేపీసీ పరిశీలనకు పంపించాలని నిర్ణయం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 11**



విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లులో ప్రతిపాదించిన మార్పులు, నిబంధనలను సమగ్రంగా పరిశీలించేందుకు జేపీసీకి అప్పగించే ప్రక్రియను చేపట్టనుంది.

**విదేశీ నిధులపై నియంత్రణ**

విదేశాల నుంచి వచ్చే విరాళాలు, వాటి వినియోగం, విదేశీ నిధులు స్వీకరించే సంస్థల కార్యకలాపాలపై నియంత్రణను మరింత పటిష్ఠం చేయడమే సవరణల ప్రధాన ఉద్దేశంగా కేంద్రం పేర్కొంది. నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా నిబంధనల్లో మార్పులు ప్రతిపాదించింది.

**విస్తృత పరిశీలనకు అవకాశం**

బిల్లును జేపీసీకి పంపడంతో ప్రతిపాదిత నిబంధనలపై అధికార, విపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఏర్పడింది. కమిటీ అవసరాన్ని బట్టి అధికారులు, నిపుణులు, సంబంధిత సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించి బిల్లులోని అంశాలను పరిశీలించనుంది.

**పార్లమెంట్‌కు నివేదిక**

జేపీసీ పరిశీలన పూర్తయిన తర్వాత తన సిఫారసులతో కూడిన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉంది. కమిటీ సూచనల ఆధారంగా బిల్లులో అవసరమైన మార్పులు చేసే అవకాశం కూడా ఉంటుంది.

**తదుపరి ప్రక్రియపై ఆసక్తి**

ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం కింద విదేశీ నిధులు స్వీకరించే సంస్థలపై పలు నియంత్రణలు అమలులో ఉన్నాయి. నిధులు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణను బలోపేతం చేయడంపై సవరణల్లో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జేపీసీ పరిశీలన నేపథ్యంలో బిల్లుపై పార్లమెంట్‌లో మరింత విస్తృత చర్చకు అవకాశం ఏర్పడింది.

# చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్'

- అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కావొద్దు..
- గుర్తించే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి .
- వారంలో పూర్తి కావాల్సిందే..
- గ్రామం, వార్డు వారీగా సర్వే.. అర్హులతో దరఖాస్తు చేయించాలి
- అధికారులంతా సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనిచేయాలి..
- కలెక్టర్ చిత్రా మిశ్రా



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామము ప్రతి వార్డు వైజ్ గా ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డి ఆర్డిఓ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించే విధానం.. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు.

తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు.

**ఇంటింటి సర్వేతో అర్హుల గుర్తింపు**

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంతమంది పింఛన్లకు అర్హులవుతారో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు.

**ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి**

ఒంటరి మహిళలు తమ జనన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు (EPIC) వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.

**పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి**

కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

గ్రామాల్లో అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకుని అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖ, మెప్మా, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అర్హులను మాత్రం మిస్ చేయవద్దని మరోసారి సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలపై సీపీఐ పోరుబాట



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గద్దె దిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. సీపీఐ ప్రచార జాతా మంగళవారం శంకరపట్నం మండలానికి చేరుకోగా తడికల్ నుంచి కేశవపట్నం వరకు మహిళా కళాకారులు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

**ప్రజా సమస్యలపై విమర్శలు**

శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ రాముడి పేరుతో అధికారంలోకి వచ్చి రామరాజ్యానికి బదులు రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు.

**కార్పొరేట్లకు రాయితీలంటూ ఆరోపణ**

అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్రం సబ్సిడీలు కల్పిస్తోందని పంజాల శ్రీనివాస్ విమర్శించారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని 750 మంది రైతులు ప్రశ్నించడంతో కేంద్ర ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుందని పేర్కొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో విద్యార్థులు ఆందోళనలకు దిగే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

**సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ**

నిత్యావసర వస్తువుల కొనుగోలుపై జీఎస్టీ ప్రభావంతో సామాన్యులపై భారం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదరి, అందే స్వామి, మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బీర్ల పద్మ, అర్ధం రమేష్, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ముంపు గ్రామాలుగా ప్రకటించండి

- రిలే నిరాహార దీక్షకు మద్దతు పలికిన తెలంగాణ రక్షణ సేన నాయకులు




**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

గంగాధర మండలం నారాయణపూర్, ఇస్తారుపల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు తెలంగాణ రక్షణ సేన నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గ నాయకుడు మ్యాక వినోద్ మాట్లాడుతూ నారాయ ణపూర్, ఇస్తారుపల్లి గ్రామ ప్ర జలు తమ గ్రామాలను ముంపుగా ప్రకటించాలని ఏళ్ల తరబడి కొట్లాడుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నారాయణ పూర్ గ్రామానికి వచ్చి నెల రోజుల్లో ముంపు గ్రామంగా ప్రకటిస్తానని ఆంజనేయ స్వామి మీద ఒట్టేసి చెప్పి ఎమ్మెల్యేగా గెలిచి 33 నెలలు గడుస్తున్నా ముంపు గ్రామాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి లింగంపల్లి నాగరాజు, నాయకులు మ్యాకల తిరుపతి, చంటి శ్రీనివాస్, బుడిగె పర్శరాంగౌడ్, కుతాడి శ్రీను, రంగనవేని లక్ష్మణ్, పుల్ల మల్లేశం, అపర్ణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# సార్లూ.. నేను బతికే ఉన్నా!





| | | | | | |
|---|---|---|---|---|---|
| tails | | | | | |
| | Srinivas Thota | Age | 39 | Aadhar No. (UID) | ********3878 |
| | Mondaiah | Type of Pension | Disabled | Address | 2-67/Bc Colony,Metpally,Shanka |
| | BC | SKS ID | KA0441414000 | Pension ID | KNSHR02045 |
| | Male | Pension Amount | 4016.00 | Pension Status | Death |
| mount | November-2014 | Last released Date & amount | 4016.00/ Apr 2026 | | |

| | | | | |
|---|---|---|---|---|
| ensioners | | | | |
| MPDO or Muncipal Commissioner | Pensioner deletion date | 04 Jun 2026 12:33:08:687 | Reason for deletion | Beneficar |
| | Details of Grievance redressal mechanism | Raise Grievance at MPDO and Approval at DRDO | | |

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన వికలాంగ పింఛన్‌దారు తోట శ్రీనివాస్ (39)ను అధికారులు బతికుండగానే మృతుడిగా నమోదు చేయడంతో పింఛన్ నిలిచిపోయింది. అధికారిక వెబ్‌సైట్‌లో తన మృతిని నమోదు చేయడంపై శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారుల తీరుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**వెబ్‌సైట్‌లో మృతి నమోదు**

తోట శ్రీనివాస్ వికలాంగుల పింఛన్ పొందుతున్నారు. అయితే జూన్ 4న శ్రీనివాస్ చనిపోయినట్లు అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. దీంతో ఆయనకు అందుతున్న పింఛన్ నిలిచిపోయింది.

**పింఛన్ పునరుద్ధరించాలని వేడుకోలు**

తాను బతికే ఉన్నప్పటికీ మృతుడిగా నమోదు చేయడంతో పింఛన్ కోల్పోయానని శ్రీనివాస్ తెలిపారు. తనను మృతుడిగా నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని, నిలిచిపోయిన పింఛన్‌ను పునరుద్ధరించాలని బాధితుడు అధికారులను వేడుకుంటున్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలి

- దుర్వాసన, వ్యర్థాలతో 15 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు..
- అఖిలపక్షం నాయకుల డిమాండ్



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండలం గుగ్గిళ్ల, పోతారం గ్రామాల శివార్లలో ఏర్పాటు చేసిన రెండు ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో చుట్టుపక్కల 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీల వ్యర్థాలను సాగునీటి కాలువల్లోకి వదులుతున్నారని ఆరోపించారు. దుర్వాసన కారణంగా పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలు ప్రారంభించినప్పటి నుంచి స్థానికులు అనేకసార్లు నిరసనలు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభం కావడంతో దుర్వాసన మరింత తీవ్రమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాన్ని వందలాది మందితో ముట్టడించామని, బెజ్జంకి మండల బంద్ కూడా నిర్వహించామని తెలిపారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఇథనాల్ ఫ్యాక్టరీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ దుంబాల రాజా మహేందర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, డీఎస్పీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల సురేష్ మహారాజ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల శేఖర్ బాబు, బీఎస్పీ మండల ఇన్‌చార్జి నిషాని సురేష్, బొమ్మిడి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి

- ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు గ్రామస్థాయిలో వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ గోపాల్ రావు సూచించారు. వెల్ది, చెల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సీడీ రిజిస్టర్, ఫార్మసీ నిల్వలు, పిల్లల వ్యాధి నిరోధక టీకాల కోసం వినియోగించే ఐఎల్ఆర్, రోజువారీ ఉష్ణోగ్రత నమోదు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో ప్రతి వారం సమావేశం నిర్వహించి ఫీవర్ సర్వే, వైద్య శిబిరాలు, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహణపై చర్చించాలని సూచించారు. జ్వర నమూనాలను టిహబ్‌కు క్రమం తప్పకుండా పంపాలని తెలిపారు. వైద్య శిబిరాల తేదీలు, ప్రాంతాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాము, కుక్క కాటుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, సిబ్బంది సెలవులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. గర్భిణుల ఆరోగ్య పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు అభా కార్డుల నమోదును పెంచాలని సూచించారు. 13 ఏళ్లకు పైబడిన వారిని ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా నిర్వహించిన ఆరోగ్య శిబిరాల్లో స్క్రీనింగ్ చేసి, అవసరమైన వారికి పునఃపరీక్షలు, తదుపరి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ వరుణ, డాక్టర్ బేయాబాణి, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులకు చెక్ పెట్టాలి

- నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు
- ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలి:
- జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

**జగిత్యాల, ఆగస్టు 11: )**

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కోరుట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

# మాల్టాలో రోడ్డు ప్రమాదం.. జగిత్యాల యువకుడు మృతి

- వివాహమైన ఆరు నెలలకే విషాదం
- ఇస్లాంపురాలో విషాదఛాయలు

**శెనార్తి మీడియా, జగిత్యాల:**



ఉపాధి కోసం మాల్టాకు వెళ్లిన జగిత్యాల పట్టణానికి చెందిన 27 ఏళ్ల యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో జగిత్యాలలోని ఇస్లాంపురా ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇస్లాంపురాకు చెందిన. మహమ్మద్ ముజాహిద్, కుమారుడు మహమ్మద్ జవాద్ (27) మాల్టాలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కారులో ప్రయాణిస్తుండగా ట్రక్కు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో జవాద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జవాద్ సుమారు ఏడాదిన్నర క్రితం ఉద్యోగం కోసం మాల్టాకు వెళ్లాడు. ఆరు నెలల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చి వివాహం చేసుకున్నాడు. అనంతరం తిరిగి మాల్టాకు వెళ్లాడు. వివాహమైన కేవలం ఆరు నెలలకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు



# తెలంగాణ తొలి శతావధాని..

# శిరశినగల్ కృష్ణమాచార్యులు

**నేడు శిరశినగల్ కృష్ణమాచార్యులు జయంతి**

**అవధాన విద్యలో తెలంగాణకు తొలి కీర్తిపతాక**

**సంస్కృతాంధ్రాల్లో 40కి పైగా గ్రంథాల రచన**

**'అభినవ కాళిదాసు'గా సాహితీ లోకంలో ఖ్యాతి**

**కవిగా.. పండితుడిగా.. గురువుగా చెరగని ముద్ర**

తెలంగాణ సాహితీ చరిత్రలో అవధాన విద్యకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మహాపండితుడు శిరశినగల్ కృష్ణమాచార్యులు. 'అభినవ కాళిదాసు', 'నైజాం రాష్ట్రాద్య శతావధాని', 'పండితరత్న', 'ఉభయ వేదాంత విద్వాన్', 'ఉభయ వేదాంతాచార్య' వంటి బిరుదులతో సాహితీ లోకంలో విశేష కీర్తి పొందారు. కోరుట్ల కృష్ణమాచార్యులుగా కూడా ప్రసిద్ధి చెందిన ఆయన తెలంగాణ ప్రాంత తొలి శతావధానిగా గుర్తింపు పొందారు. కృష్ణమాచార్యులు 1905 ఆగస్టు 12న నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్‌లో రంగమ్మ, వేంకటాచార్య దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచిన ఆయన పితామహుడు సింగరాచార్యులు, తండ్రి వేంకటాచార్యుల వద్ద ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. అనంతరం మాతామహుడు గోవిందాచార్యుల వద్ద 1914 నుంచి 1921 వరకు కావ్య, నాటక, అలంకార సాహిత్యంతో పాటు తిరుమంత్రార్థం, శ్రీవచన భూషణ వ్యాఖ్యానం తదితర గ్రంథాలను అధ్యయనం చేశారు. తర్వాత వల్లంకొండలో కనకాపురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందోర్భుల వెంకన్న వద్ద సిద్ధాంత భాగం, పిఠాపురంలో గుదిమెళ్ల రంగాచార్యుల వద్ద వేదాంతాన్ని అభ్యసించారు. ఇలా సాహిత్యం, తర్కం, వేదాంతం వంటి విభిన్న శాస్త్రాల్లో విశేష పాండిత్యాన్ని సంపాదించారు. 1926లో కోరుట్లలోని ఉభయ వేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన తన అధ్యాపక ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. చివరకు కోరుట్లలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ అధ్యాపక జీవితంలో ఎంతోమంది విద్యార్థులకు సంస్కృత సాహిత్యం, వేదాంత విద్యను బోధించి పండితులుగా తీర్చిదిద్దారు.

## నలభైకి పైగా రచనలు

సంస్కృతాంధ్ర భాషల్లో కృష్ణమాచార్యులు 40కి పైగా గ్రంథాలు రచించారు. కావ్యాలు, శతకాలు, సుప్రభాతాలు, స్తుతిగీతాలు, హరికథలు తదితర ప్రక్రియల్లో ఆయన కలం సాగింది. 'కళాశాల అభ్యుదయం', 'రామానుజ చరితం', 'చిత్రప్రబంధ రత్నమాల', 'మనస్సందేశ కావ్యము', 'సంపత్కుమార సంభవ కావ్యము', 'గాంధీతాత నీతిశతకము', 'గీతాచార్య మతప్రభావ శతకము' ఆయన రచనల్లో ముఖ్యమైనవి. వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతం, వేణుగోపాలస్వామి సుప్రభాతం, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతంతో పాటు 'పద్మావతీ పరిణయము', 'రుక్మిణీ కల్యాణము' వంటి హరికథలను రచించారు. 'విశిష్టాద్వైతమత సంగ్రహము', 'వేదార్థ సంగ్రహము', 'గురువంశ కావ్యనిధి' వంటి రచనలతో తన వేదాంత పాండిత్యాన్ని చాటారు. 'స్వీయ కవితానుజీవనం' పేరుతో తన జీవిత విశేషాలను కూడా అక్షరబద్ధం చేశారు.

## అవధానంలో అపూర్వ ప్రతిభ

కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి తదితర ప్రాంతాల్లో అష్టావధానాలు, శతావధానాలు నిర్వహించి కృష్ణమాచార్యులు తన అసాధారణ ధారణాశక్తిని ప్రదర్శించారు. తెలంగాణ ప్రాంతంలో తొలి శతావధానిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన ప్రతిభకు మెచ్చి సాహితీ ప్రపంచం 'నైజాం రాష్ట్రాద్య శతావధాని', 'పండితరత్న', 'ఉభయ వేదాంత విద్వాన్', 'ఉభయ వేదాంతాచార్య' వంటి బిరుదులతో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఢిల్లీలో జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలతో పాటు తొలి ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ కృష్ణమాచార్యులు ఘన సత్కారాలు అందుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఆయనను సత్కరించారు. కృష్ణమాచార్యుల సాహితీ కృషిపై కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో పలువురు పరిశోధకులు పరిశోధనలు చేసి పీహెచ్‌డీలు పొందడం ఆయన రచనల ప్రామాణికతకు నిదర్శనం. తెలుగు, సంస్కృత సాహిత్యాలకు జీవితాన్ని అంకితం చేసి, అవధాన విద్యలో తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టిన శిరశినగల్ కృష్ణమాచార్యులు సాహితీ లోకంలో చిరస్మరణీయులు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహాపండితుడి సాహితీ సేవలను స్మరించుకోవడం తెలుగు భాషకు ఇచ్చే గౌరవమే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి

**నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం**




భారత దేశంలో అకడమిక్ లైబ్రరీలతోపాటు, పబ్లిక్ లైబ్రరీలలో అభివృద్ధికి, గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించి దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. లెక్కల ప్రొఫెసరైన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ 1923లో మద్రాసు యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా చేరాడు. తనకు దొరికిన ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని గ్రంథాలయ వ్యవస్థకు సంబంధించిన ప్రపంచవ్యాప్త ధోరణులను పరిశీలించి, 1924లో క్లాసిఫికేషన్, 1933లో గ్రంథాలయ కేటలాగుల్ని తయారు చేయడానికి ఒక కొత్త కోడ్‌ను రూపొందించాడు. కోలన్ క్లాసిఫికేషన్ అని పిలిచే ఈ వర్గీకరణ పద్ధతిని దేశంలోని అనేక గ్రంథాలయాలు అనుసరిస్తున్నాయి. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణం గానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# గజరాజులే అడవికి ప్రాణం..

# వాటి రక్షణే ప్రకృతికి శ్రీరామరక్ష



**భారతీయ సంస్కృతిలో ఏనుగుకు విశిష్టమైన స్థానం ఉంది. జ్ఞానం, శక్తి, శాంతి, దయకు ప్రతీకగా గజరాజును ఆరాధిస్తాం. విఘ్నాలను తొలగించే వినాయకుడిని గజాననుడిగా కొలుస్తాం. పురాణాల నుంచి పర్యావరణం వరకు మన జీవన విధానంతో విడదీయరాని అనుబంధం కలిగిన ఏనుగుల సంరక్షణ అవసరాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

2012లో కెనడాకు చెందిన సినీ నిర్మాత పట్రిషియా సిమ్స్, థాయ్‌లాండ్‌కు చెందిన ఏనుగు సంరక్షణ సంస్థ చొరవతో ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రభుత్వాలు, వన్యప్రాణి సంరక్షణ సంస్థలు, పర్యావరణవేత్తలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజాలు ఏనుగుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

## అడవికి గజరాజే ఇంజినీర్

ఏనుగులు కేవలం భారీ వన్యప్రాణులు మాత్రమే కాదు. అడవుల మనుగడలో వాటిది అత్యంత కీలకమైన పాత్ర. అందుకే పర్యావరణ శాస్త్రవేత్తలు ఏనుగులను కీలక జీవజాతుల్లో ఒకటిగా పరిగణిస్తారు. అడవుల్లో సంచరిస్తూ విత్తనాలను సుదూర ప్రాంతాలకు వ్యాప్తి చేస్తాయి. నీటి కోసం నేలను తవ్వుతూ ఇతర వన్యప్రాణులకు కూడా నీటి వనరులను అందుబాటులోకి తెస్తాయి. దట్టమైన అరణ్యాల్లో దారులను సృష్టిస్తాయి. గడ్డి మైదానాల పునరుజ్జీవనానికీ తోడ్పడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఏనుగు అడుగుజాడల్లోనే అనేక జీవులకు జీవన మార్గం ఏర్పడుతుంది.

## సంస్కృతిలోనూ ప్రత్యేక స్థానం

భారతీయ సంప్రదాయంలో ఏనుగు జ్ఞానం, శక్తి, సౌభాగ్యం, పరాక్రమానికి ప్రతీక. పురాణాలు, ఇతిహాసాల్లో గజరాజులకు విశిష్టమైన స్థానం కనిపిస్తుంది. భాగవతంలోని 'గజేంద్ర మోక్షం' కథ భక్తి, ధర్మం, రక్షణకు ప్రతీకగా తరతరాలుగా ప్రజల్లో నిలిచిపోయింది. వినాయకుడి రూపంలో గజముఖాన్ని ఆరాధించడం భారతీయులకు ఏనుగులతో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధానికి నిదర్శనం.

## మనుగడకు పొంచి ఉన్న ముప్పులు

ప్రపంచవ్యాప్తంగా ఆఫ్రికన్, ఆసియా ఏనుగులు ప్రధానంగా కనిపిస్తాయి. అయితే దంతాల కోసం అక్రమ వేట, అడవుల విధ్వంసం, ఆవాసాల విచ్ఛిన్నం, మానవ–ఏనుగు ఘర్షణలు, వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సమస్యలు వాటి మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నాయి. అరణ్య ప్రాంతాల్లో మానవ కార్యకలాపాలు విస్తరించడంతో సంప్రదాయ ఏనుగు కారిడార్లు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏనుగులు జనావాసాలు, పంట పొలాల్లోకి ప్రవేశించడం.. అక్కడ ఘర్షణలు చోటుచేసుకోవడం తీవ్రమైన సమస్యగా మారుతోంది.

**నేడు ప్రపంచ ఏనుగుల దినోత్సవం**

## భారత్‌కు మరింత బాధ్యత

ఆసియా ఏనుగుల ప్రధాన ఆవాస దేశాల్లో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అందువల్ల గజరాజుల సంరక్షణలో భారత్‌పై మరింత బాధ్యత ఉంది. అడవి ఏనుగుల సంరక్షణ, వాటి సహజ ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణ, అక్రమ వేట నియంత్రణ, మానవ–ఏనుగు ఘర్షణల నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 1992లో లిలి'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'లిలిను ప్రారంభించింది. ఏనుగులు స్వేచ్ఛగా సంచరించే మార్గాలను కాపాడటం ఈ ప్రయత్నాల్లో అత్యంత కీలకం.

## గజరాజును కాపాడితే.. అడవిని

ఏనుగుల పరిరక్షణ అంటే ఒక్క జీవజాతిని కాపాడటం మాత్రమే కాదు. వాటిపై ఆధారపడిన మొత్తం జీవావరణ వ్యవస్థను రక్షించడం. అడవులు నిలవాలంటే వాటిలోని జీవవైవిధ్యం నిలవాలి. ఆ జీవవైవిధ్యానికి గజరాజులు ప్రధాన ఆధారం. అందుకే ఏనుగుల సహజ ఆవాసాలను కాపాడటం, అక్రమ దంతాల వ్యాపారాన్ని అరికట్టడం, ఏనుగు కారిడార్లలో ఆక్రమణలను నిరోధించడం, మానవ–ఏనుగు ఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనడం అత్యవసరం.

**గజరాజుల రక్షణే అడవుల రక్షణ.. అడవుల రక్షణే పర్యావరణ పరిరక్షణ. ఈ భావన ప్రతి ఒక్కరిలో పెరిగినప్పుడే భవిష్యత్ తరాలకు గజరాజుల ఘీంకారాన్ని, పచ్చని అడవులను వారసత్వంగా అందించగలం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రపంచాన్ని ఏలిన విండీస్‌కు..
# ఇప్పుడు బెర్త్ కోసం అగ్నిపరీక్ష!

- ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం
- రెండుసార్లు ప్రపంచకప్ విజేతకు ఇప్పుడు క్వాలిఫయర్స్ గండం
- నేరుగా అర్హత అవకాశాలకు అఫ్గానిస్థాన్ గండి
- ప్రపంచకప్ చేరాలంటే సుదీర్ఘ క్వాలిఫయింగ్ పోరు
- కరేబియన్ దిగ్గజాలు గట్టెక్కుతారా?.. మళ్లీ నిరాశేనా?



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏకచక్రాధిపత్యంతో ఏలిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి ఇప్పుడు ప్రపంచకప్ బెర్త్ కోసం పాకులాడే స్థాయికి చేరింది. రెండుసార్లు వన్డే ప్రపంచకప్, రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన కరేబియన్ జట్టు.. వచ్చే ఏడాది జరిగే 50 ఓవర్ల ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు నాటికి ర్యాంకింగ్స్‌లో అర్హత స్థానాల్లో నిలిచే జట్లకు నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కుతుంది. అయితే ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ విజయంతో పుంజుకోవడం వెస్టిండీస్ అవకాశాలను దెబ్బతీసింది. దీంతో కరేబియన్ జట్టు ఇప్పుడు ప్రపంచకప్‌కు చేరాలంటే కఠినమైన క్వాలిఫయింగ్ ప్రక్రియను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం కూడా వెస్టిండీస్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. క్వాలిఫయర్స్‌లో విఫలమై సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయింది. ఆ పరాభవం కారణంగా తర్వాతి ఛాంపియన్స్ ట్రోఫీ అవకాశాన్నీ కోల్పోయింది. ఇప్పుడు మరోసారి అదే ప్రమాదం కరేబియన్ జట్టును వెంటాడుతోంది. ప్రపంచకప్ బెర్త్ సాధించాలంటే వెస్టిండీస్ సుదీర్ఘమైన అర్హత పోరును దాటాల్సి ఉంటుంది. ప్రధాన క్వాలిఫయర్‌లో అగ్రస్థానాల్లో నిలవడంతో పాటు తదుపరి దశల్లోనూ నిలకడగా రాణించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడలా నిలిచిన జట్టు.. ఇప్పుడు తానే ప్రపంచకప్‌లో చోటు కోసం పోరాడాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది. వివియన్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గార్డన్ గ్రీనిడ్జ్, మైఖేల్ హోల్డింగ్ వంటి దిగ్గజాలతో ప్రపంచ క్రికెట్‌ను వణికించిన వెస్టిండీస్.. మళ్లీ ఆ వైభవాన్ని అందుకుంటుందా? కఠినమైన అర్హత పోరును దాటి ప్రపంచకప్ వేదికపై అడుగుపెడుతుందా? లేక మరోసారి మెగా టోర్నీకి ప్రేక్షకపాత్రకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## పసికూనకు ప్రపంచకప్ బెర్త్.. రెండుసార్లు ఛాంపియన్‌కు బిగ్ షాక్!

### 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అఫ్గానిస్థాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా ప్రస్థానం ప్రారంభించి సంచలన విజయాలతో దిగ్గజ జట్లకు సవాల్ విసురుతున్న అఫ్గానిస్థాన్ మరో ఘనత సాధించింది. 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో మూడు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో మెగా టోర్నీలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏలిన రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈ పరిణామం భారీ షాక్‌గా మారింది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన రషీద్.. బ్యాటింగ్‌లో కీలక సమయంలో 43 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో అతడికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఐదు వన్డేల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లోనే అఫ్గానిస్థాన్ తన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటింది. ఆ టోర్నీలో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి బలమైన జట్లను మట్టికరిపించి సంచలనం సృష్టించింది. రషీద్ ఖాన్ వంటి అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లు రాణిస్తుండటంతో 2027 ప్రపంచకప్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో అఫ్గాన్ ఉంది.



**విండీస్‌కు అఫ్గాన్ దెబ్బ**

అఫ్గానిస్థాన్ విజయం వెస్టిండీస్ ఆశలపై నీళ్లు చల్లింది.

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన కరేబియన్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. గత ప్రపంచకప్‌నకు కూడా నేరుగా అర్హత పొందలేకపోయిన వెస్టిండీస్.. క్వాలిఫయర్స్‌లోనూ విఫలమై తొలిసారిగా మెగా టోర్నీకి దూరమైంది. ఇప్పుడు మరోసారి అదే కఠిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించేందుకు సెప్టెంబర్ 30ను గడువుగా నిర్ణయించారు. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు ఆటోమేటిక్ బెర్త్ లభిస్తుంది. మిగిలిన స్థానాలకు ర్యాంకింగ్స్ కీలకం కానున్నాయి. ఐర్లాండ్‌పై విజయంతో అఫ్గానిస్థాన్ తన స్థానాన్ని పదిలం చేసుకోవడంతో వెస్టిండీస్‌కు నేరుగా ప్రపంచకప్ చేరే మార్గం మూసుకుపోయింది. కటాఫ్ తేదీకి ముందు వెస్టిండీస్‌కు మరో రెండు వన్డేలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిలో గెలిచినా అఫ్గానిస్థాన్‌ను వెనక్కినెట్టి నేరుగా అర్హత సాధించే అవకాశం లేదన్న సమీకరణాలు కరేబియన్ జట్టును కలవరపెడుతున్నాయి.

### క్వాలిఫయర్సే దిక్కు!

ఇక వెస్టిండీస్ ప్రపంచకప్‌లో ఆడాలంటే క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాల్సిందే. 10 జట్లతో జరిగే అర్హత టోర్నీలో కీలక విజయాలు సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడగా నిలిచిన రెండుసార్లు ఛాంపియన్.. ఇప్పుడు పసికూనగా మొదలైన అఫ్గానిస్థాన్ నేరుగా బెర్త్ కొట్టేస్తుంటే తాను మాత్రం క్వాలిఫయర్స్ బాట పట్టాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది.

# 29 టెస్టులు.. 29 మైదానాలు!

- ఇదెక్కడి వింత రికార్డు జైస్వాల్!
- ఆడిన ప్రతీ టెస్టుకూ కొత్త వేదికే
- ఒక్క మైదానంలోనూ రెండోసారి ఆడని ఓపెనర్
- గాల్‌లో 30వ టెస్టుతో అరుదైన ఘనతకు అడుగు
- 29 టెస్టుల్లో 2,535 పరుగులు.. ఏడు శతకాలు
- శ్రీలంక సిరీస్‌లో జైస్వాల్‌పైనే అందరి చూపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో బ్యాటుతో పరుగుల వరద పారించడమే కాదు.. ఓ విచిత్రమైన రికార్డుతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పటివరకు కెరీర్‌లో 29 టెస్టులు ఆడిన జైస్వాల్.. ఆ 29 మ్యాచ్‌లనూ 29 వేర్వేరు వేదికల్లో ఆడటం విశేషం. ఒక్క మైదానం కూడా పునరావృతం కాకపోవడం ఈ రికార్డును మరింత ఆసక్తికరంగా మార్చింది. 2023లో వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఆ తర్వాత భారత జట్టులో రెగ్యులర్ ఓపెనర్‌గా స్థానం సుస్థిరం చేసుకున్నాడు. స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుసగా అవకాశాలు అందుకున్నా.. ప్రతి టెస్టుకూ వేదిక మారుతూ వచ్చింది. అలా 29 టెస్టులు పూర్తయ్యేసరికి 29 వేర్వేరు మైదానాల్లో ఆడిన అరుదైన ఘనత అతడి ఖాతాలో చేరింది. ఇప్పుడు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో జైస్వాల్ మరో ఆసక్తికర మైలురాయి అందుకోనున్నాడు. ఆగస్టు 15 నుంచి గాల్‌లో జరిగే తొలి టెస్టు అతడి కెరీర్‌లో 30వది కానుంది. గాల్‌లోనూ జైస్వాల్‌కు ఇదే తొలి టెస్టు కావడంతో '30 టెస్టులు.. 30 వేదికలు' అనే అరుదైన రికార్డు కొనసాగనుంది. జైస్వాల్ ఇప్పటివరకు 29 టెస్టుల్లోని 54 ఇన్నింగ్స్‌లలో 48.75 సగటుతో 2,535 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలు, 13 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 214 పరుగులు కాగా.. రెండు ద్విశతకాలు కూడా అతడి ఖాతాలో ఉన్నాయి. 317 ఫోర్లు, 45 సిక్సర్లతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన దూకుడు చూపిస్తున్నాడు. జూన్‌లో అఫ్గానిస్థాన్‌పై తన 29వ టెస్టు ఆడిన జైస్వాల్.. ఇప్పుడు శ్రీలంక గడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి. గాల్ తర్వాత కొలంబో కూడా అతడికి కొత్త వేదిక కావడంతో ఈ విచిత్రమైన రికార్డు మరింత ముందుకు సాగే అవకాశముంది.



## చైనా గడ్డపై శ్రేయాషి చరిత్ర

### అంతర్జాతీయ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం

### ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు

**న్యూ ఢిల్లీ:** భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి చరిత్ర సృష్టించింది. చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించిన సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషుయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇప్పటికే స్వర్ణ పతకాలతో తన ప్రతిభను చాటుకున్న శ్రేయాషి.. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లోనూ పతకం సాధించి భారత కీర్తిపతాకను రెపరెపలాడించింది. క్లాసిక్ స్లాలోమ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి కాంస్యాన్ని అందుకుంది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషికి చిన్నతనం నుంచే స్కేటింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. మూడేళ్ల వయసులోనే తన సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ప్రారంభించింది. ఆరేళ్లు వచ్చేసరికి జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగి అందరి దృష్టిని ఆకర్షించింది. 2021లో మొహాలిలో నిర్వహించిన 59వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ విభాగాల్లో శ్రేయాషి రెండు స్వర్ణ పతకాలను సాధించింది. 2024లో బెంగళూరులో జరిగిన 62వ జాతీయ చాంపియన్‌షిప్స్‌లోనూ ఇదే జోరు కొనసాగిస్తూ స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింటిలో స్వర్ణాలు గెలుచుకుంది. రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించిన భారత స్కేటర్లలో జినేష్ నానల్‌తో కలిసి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2017లో చైనాలోని నాన్‌జింగ్‌లో జరిగిన ప్రపంచ రోలర్ గేమ్స్‌లో కేవలం 12 ఏళ్ల వయసులోనే శ్రేయాషి భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఫ్రీస్టైల్, స్పీడ్ విభాగాల్లో వరుసగా 20, 22వ స్థానాల్లో నిలిచి అంతర్జాతీయ వేదికపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2025లో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి సంచలనం సృష్టించింది. ఇన్‌లైన్ ఫ్రీస్టైల్, క్లాసిక్ స్లాలోమ్‌లో స్వర్ణాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అప్పట్లో రికార్డు నెలకొల్పింది. తాజాగా చైనా గడ్డపై కాంస్య పతకం సాధించి తన విజయ ప్రస్థానంలో మరో చారిత్రక ఘనతను జోడించింది.





## బోదన, శ్రేయస్ అదరహో..

### బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో టైటిళ్లు కైవసం

### లండన్‌లో భారత సంతతి చెస్ ప్లేయర్ల సత్తా

**లండన్:** పసివయసులోనే 64 గళ్ల ఆటపై మక్కువ పెంచుకుని ఆటలో అద్భుతాలు సృష్టిస్తున్న బోదన శివానందన్, శ్రేయస్ రాయల్ బ్రిటన్ గడ్డపై సత్తాచాటారు. 122 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో భారత సంతతికి చెందిన ఈ ఇద్దరు చెస్ ప్లేయర్లూ.. తమ విభాగాల్లో టైటిళ్లు గెలిచి ఔరా అనిపించారు. సుమారు 1,750 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో 11 ఏండ్ల బోదన.. మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలువగా ఓపెన్ కేటగిరీలో17 ఏండ్ల శ్రేయస్ విజయం సాధించాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన ర్యాపిడ్ చెస్ ప్లేఆఫ్స్‌లో బోదన.. ఐర్లాండ్‌కు చెందిన 14 ఏండ్ల త్రిషా కన్యమరలను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆ చిన్నారి బ్రిటన్ యంగెస్ట్ ఉమెన్స్ చెస్ చాంపియన్‌గా సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ వెస్ట్ లండన్‌లో నివసిస్తున్న బోదన.. కోవిడ్ సమయంలో చెస్ నేర్చుకుంది. ఇప్పటికే యూకే ఓపెన్ ఉమెన్స్ బ్లిట్జ్ చాంపియన్ గెలవడంతో పాటు బ్రిటీష్ ఉమెన్స్ ర్యాపిడ్ విజేతగా నిలిచి సత్తాచాటింది. తాజాగా క్లాసికల్ ఫార్మాట్‌లోనూ ఆమె టైటిల్ గెలవడం గమనార్హం. ఇక ఓపెన్ విభాగంలో శ్రేయస్.. తొమ్మిది రౌండ్ల తర్వాత బ్రిటన్‌లో అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లను దాటుకుని పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచి విజేతగా నిలిచాడు. 15 ఏండ్ల వయసులోనే ఇంగ్లండ్‌లో అతిపిన్న గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపుపొందిన అతడు.. పుట్టింది బెంగళూరులోనే. ఎనిమిదేండ్ల క్రితం శ్రేయస్ తల్లిదండ్రులు లండన్‌లో స్థిరపడ్డారు.



# మానస అందాల మెరుపులు

సినిమాల పరంగా కాస్త నెమ్మదిగా సాగుతున్నా.. అందాల ప్రదర్శనలో మాత్రం మానస వర్మ జోరు కొనసాగిస్తోంది. 'వనవీర' తర్వాత ఆమె నుంచి మరో సినిమా ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈలోగా సామాజిక మాధ్యమాల్లో తన తాజా ఫొటోలను పంచుకుంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా రంగురంగుల దుస్తుల్లో మెరిసిన మానస వర్మ అందరి దృష్టినీ ఆకర్షించింది. నారింజ-ఎరుపు రంగు పైదుస్తులకు గులాబీ రంగు పొడవాటి స్కర్ట్‌ను జతచేసి మానస ధరించిన తీరు ప్రత్యేకంగా కనిపించింది. పలుచని పట్టీలతో కూడిన దుస్తులు ఆమెకు చక్కని వేసవి అందాన్ని తీసుకొచ్చాయి. వదులుగా వదిలేసిన ముంగురులు, సున్నితమైన బంగారు ఆభరణాలు, సహజమైన అలంకరణతో ఎంతో అందంగా కనిపించింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు చిత్రాలకు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. సరస్సు ఒడ్డున ప్రకృతి అందాల మధ్య మానస ఇచ్చిన పోజులు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రశాంతమైన నేపథ్యానికి భిన్నంగా మెరిసే దుస్తుల రంగులు ఈ చిత్రాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విహారయాత్రకు వెళ్లిన అందాల భామను తలపించేలా ఉన్న ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# మోహన్ లాల్ కుమార్తె విస్మయ

## తుడక్కం మూవీతో అరంగేట్రం



మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ. 2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ. 6.63 కోట్లు) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# సన్నని సోయగంతో కావ్యా థాపర్



**అభిమానులను ఆకట్టుకుంటున్న కథానాయిక**

**నీలిరంగు దుస్తుల్లో అందాల విందు**

**తాజా ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్**

సినిమా: కథానాయిక కావ్యా థాపర్ కొత్త రూపంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో మునుపటి కంటే మరింత సన్నగా, చక్కటి ఆకృతితో కనిపిస్తూ సందడి చేసింది. బరువు తగ్గి కొత్త రూపంలో మెరిసిపోతున్న కావ్యా ఫొటోలపై అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. నీలం రంగు ముద్రిత పొడవాటి దుస్తుల్లో కావ్యా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నడుము భాగంలో ప్రత్యేక ఆకృతి, కిందకు వాలుగా ఉన్న దుస్తుల తీరు ఆమె సోయగాన్ని మరింత ఇనుమడింపజేశాయి. చేతులకు బంగారు గాజులు, కాళ్లకు ఎత్తుమడమల చెప్పులతో అందంగా ముస్తాబైన ఆమె కెమెరా ముందు సరదాగా పోజులిచ్చింది. తన కొత్త రూపాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రదర్శిస్తూ అభిమానుల చూపు తిప్పుకోనివ్వకుండా చేసింది. కావ్యా థాపర్ చివరిసారిగా 2024లో విడుదలైన 'విశ్వం' చిత్రంలో ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత ఆమె నటించిన మరో చిత్రం తెరపైకి రాలేదు. కొత్త సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఈ భామ.. మరోవైపు ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

# పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం

'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.






# కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.




Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644